www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 6 జనవరి 2024

5

పశ్చిమ గోదావరి



సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణ : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

రానున్న ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రశాంతి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్‌రెడ్డి సంయుక్తంగా వివిధ రెవెన్యూ అంశాలపై జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు, రీసర్వే, సమీక్ష, స్పోక్ ప్లాంటేషన్, ఇనామ్ భూములు తదితర పెండింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ నెల 5 నుంచి 10వ తేదీ వరకూ రీసర్వేకు సంబంధించిన గ్రీవెన్స్ స్వీకరణ కార్యక్రమం జరుగుతున్నారు. 17 నుంచి 21వ తేదీ వరకూ వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం ఆర్‌డిఒలు కె.శ్రీనివాసులురాజు, ఎం.అచ్యుత్ అంబరీష్, కె.చెన్నయ్య, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్ పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా కాదు..

పోరాడుదాం ఆంధ్రా..

ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఉద్యోగ, ఉపాధ్యాయులు, అంగన్వాడీ, మున్సిపల్ కార్మికులు, ఎస్ఎస్ఎ ఉద్యోగులు అంతా సమ్మె, ఆందోళనలతో హోరెత్తిస్తున్నారు. ఇవేమీ పట్టని ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' అంటూ ముఖ్యమంత్రి జగన్ క్రికెట్ బ్యాట్‌తో ఫోజులు ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే అంగన్వాడీలు మాత్రం 'ఆడుదాం ఆంధ్రా కాదని.. పోరాడుతాం ఆంధ్రా అంటూ పాలకోడేరులో క్రికెట్ ఆడి వినూత్నరీతిలో నిరసన చేపట్టారు. తమ సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్ క్లీన్‌బౌల్డ్ కాక తప్పదని హెచ్చరిస్తున్నారు.



పాలకోడేరులో క్రికెట్ ఆడి నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

రోజురోజుకీ అంగన్వాడీల సమ్మె ఉధృతం

పూర్తయిన ప్రభుత్వ డెడ్‌లైన్

డిమాండ్లు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగిస్తామంటున్న అంగన్వాడీలు

పాలకోడేరులో క్రికెట్ ఆడి వినూత్న నిరసన

నేడు జిల్లా కలెక్టరేట్ వద్ద 24 గంటల రిలే నిరాహారదీక్షకు సమాయత్తం

ప్రజాశక్తి - భీమవరం

జిల్లావ్యాప్తంగా అంగన్వాడీలు చేపట్టిన సమ్మె రోజురోజుకీ ఉధృతమవుతోంది. స్పందించాల్సిన ప్రభుత్వం మాత్రం సమ్మెను అణిచివేయాలనే ధోరణితో ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతోంది. సమ్మెపై నిర్బంధం విధించి, భయభ్రాంతులకు గురిచేసి, బెదిరింపులకు పాల్పడి, అక్రమంగా అరెస్టులు చేసి, పోలీస్ స్టేషన్లకు తరలించి.. చివరకు విధులకు హాజరు కాకపోతే ప్రత్యామ్నాయం చూసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించినా అంగన్వాడీలు మాత్రం వెనకడుగు వేయకుండా సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని నాలుగున్నరేళ్లలో దఫదఫాలుగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో అంగన్వాడీలు అనేక రూపాల్లో ఆందోళనలు చేపట్టి ప్రభుత్వ పెద్దలతో చర్చలు జరిపినా ఫలితం లేకుండాపోయింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని సుమారు 1674 అంగన్వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న సుమారు మూడు వేల మంది అంగన్వాడీలంతా మూకుమ్మడిగా డిసెంబర్ 12న అంగన్వాడీ కేంద్రాలకు తాళాలు వేసి సమ్మెబాట పట్టారు. మండలం, పట్టణ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన శిబిరాల్లో అంగన్వాడీలు సమ్మె సాగిస్తున్నారు. సమ్మె చేపట్టి నేటికి 26 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లేదు. తూతూమంత్రంగా చర్చలు జరడపమే తప్ప సమస్యల శాశ్వత పరిష్కారానికి ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. ప్రభుత్వమే అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టించడం వివాదాస్పదమైంది. సచివాలయ ఉద్యోగులు, సమీప పాఠశాల ప్రధానోపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించినా వారూ చేతులెత్తేయడంతో కంగుతిన్న ప్రభుత్వం అంగన్వాడీలపై బెదిరింపుల పర్వం ప్రారంభించింది. ఐదో తేదీలోపు విధులకు హాజరు కాకపోతే ప్రత్యామ్నాయ చర్యలు చేపడతామని ఇచ్చిన ఆదేశాలపై నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. అంగన్వాడీలు ఎట్టి పరిస్థితుల్లోనూ తాము వెనక్కి తగ్గేది లేదని, సమస్యలను పరిష్కరిస్తేనే సమ్మె విరమిస్తామని ఘంటాపథంగా చెబుతున్నారు.

పాలకోడేరులో క్రికెట్ ఆడి వినూత్న నిరసన

పాలకోడేరులో అంగన్వాడీలు క్రికెట్ ఆడి వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. గొల్లలకోడేరుకు చెందిన అంగన్వాడీ టీచర్ జగన్ మాస్కును ధరించి క్రికెట్ బ్యాటింగ్ దిగగా పాలకోడేరుకు చెందిన అంగన్వాడీ కార్యకర్త మాస్క్ ధరించి బౌలింగ్ వేసి జగన్‌ను క్లీన్‌బౌల్డ్ చేసి వినూత్న నిరసన చేపట్టారు. పోరాడుదాం ఆంధ్రా అంగన్వాడీల జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ ప్రభుత్వం అంగన్వాడీల పట్ల అవలంబిస్తున్న విధానాల పట్ల మండిపడ్డారు.

24 గంటల రిలే నిరాహార దీక్షలకు సమాయత్తం

ఈ నెల ఆరో తేదీన కలెక్టరేట్ వద్ద 24 గంటల రిలే నిరాహారదీక్షకు అంగన్వాడీలు సన్నద్ధమవుతున్నారు. నిర్బంధాలను ఎదుర్కొని బుధవారం జిల్లాకేంద్రంలో నిరసన చేపట్టిన అంగన్వాడీలు మరింత సమరోత్సాహంతో దీక్షలకు దిగనున్నారు.

మా పట్ల ఇంత నిర్లక్ష్యం తగదు..

టి.కమలకుమారి, అంగన్వాడీ ఆయా, బేతపూడి



గర్భిణీలకు బాలింతలకు చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతోపాటు ప్రభుత్వం పనుల్లో కీలక పాత్ర పోషిస్తున్నాం. సమస్యలు పరిష్కారానికి 25 రోజుల నుంచి సమ్మె చేస్తున్న ప్రభుత్వం మా పట్ల ఇంత నిర్లక్ష్యం వహించడం తగదు. సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు సమ్మె కొనసాగిస్తాం.

పరిష్కారమయ్యే వరకూ విధులకు హాజరు కాబోము

జె.మెర్సీకుమారి, అంగన్వాడీ ఆయా, కొత్తపూసలమర్రు



ఎన్ని సమస్యలున్నా 17 ఏళ్ల నుంచి పని చేస్తున్నాను. ప్రభుత్వంపై కడుపు మండిపోయి ఉన్నాను. సమ్మె చేస్తున్నా పట్టించుకోవట్లేదు. వేరే వాళ్లతో కేంద్రాలను నిర్వహిస్తామని చెబుతున్నారు. ఎవరు నిర్వహిస్తారు.. ఎలా నిర్వహిస్తారో చూస్తాను. ప్రభుత్వం ఎన్ని బెదిరింపులకు దిగినా సమస్యలు పరిష్కారమయ్యే వరకు విధులకు హాజరు కాబోము.

రాబోయే రోజుల్లో జగన్ క్లీన్‌బౌల్డ్

జెఎన్‌వి.గోపాలన్, సిఐటియు జిల్లా అధ్యక్షులు



అంగన్వాడీల సమ్మె రోజు రోజుకీ ఉధృతమవుతోంది. ప్రభుత్వం మాత్రం సమస్యలు పరిష్కరించట్లేదు. అంగన్వాడీలతోపాటు మున్సిపల్ కార్మికులు, ఎస్ఎస్ఎ ఉద్యోగులు సైతం సమ్మె చేస్తున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆందోళనలతో హోరెత్తిస్తున్నారు. అంగన్వాడీల సమ్మెతో రాబోయే రోజుల్లో జగన్ క్లీన్‌బౌల్డ్ అవ్వక తప్పదు. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు అనే విషయాన్ని ప్రభుత్వం గుర్తుంచుకోవాలి.



లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి, ఎంఎల్‌సి శ్రీనివాస్

2,439 మందికి రూ.3.78 కోట్ల లబ్ధి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

సంక్షేమ పథకాలను అర్హతే ప్రామాణికంగా మంజూరు చేసి జిల్లాలో 2,439 మందికి రూ.3.78 కోట్ల లబ్ధి చేకూరిందని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. అర్హులెవరూ పథకాలకు దూరం కాకూడదనే ఉద్దేశంతో మిగిలిపోయిన లబ్ధిదారులకు ప్రభుత్వం పథకాలను విడుదల చేసింది. దీనిలో భాగంగా జిల్లాకు చెందిన 2,439 మంది లబ్ధిదారులకు రూ.3.78 కోట్లు విలువైన పథకాలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గురువారం విడుదల చేశారు. జిల్లా నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరు పి.ప్రశాంతి, శాసనమండలి సభ్యులు కవురు శ్రీనివాస్, సంబంధిత అధికారులు, వివిధ పథకాలకు చెందిన లబ్ధిదారులు పాల్గొని తిలకించారు. అనంతరం లబ్ధిదారులకు నమూనా చెక్కును కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కెసిహెచ్.అప్పారావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డి.మహేశ్వరరావు, జిల్లా రవాణా శాఖ అధికారి ఉమా మహేశ్వర రావు పాల్గొన్నారు.



తణుకులో పొర్లు దండాలు పెట్టి నిరసన తెలుపుతున్న కార్మికులు, నేతలు

పొర్లు దండాలెట్టాం.. పరిష్కరించండి

11వ రోజు కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - తణుకు రూరల్

కరోనా మహమ్మారికి వ్యతిరేకంగా ప్రజల ప్రాణాలు కాపాడిన మున్సిపల్ కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించకపోవడం సిగ్గు చేటని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, మండల అధ్యక్షులు ఎన్.ఆదినారాయణ బాబు విమర్శించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మెలో భాగంగా 11వ రోజు కార్మికులు పొర్లు దండాలు పెట్టి నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కారం చేయమంటే పోటీ కార్మికులను తీసుకురావడం సిగ్గుచేటు అన్నారు. ఈ సందర్భంగా ప్రతాప్, నీలాపు ఆదినారాయణ బాబు మాట్లాడుతూ ఇచ్చిన మాట అమలు చేయమంటే కార్మికులపై ప్రభుత్వం దాడి చేయడం అన్యాయమన్నారు. పోటీ కార్మికుల వల్ల జరిగే పరిణామాలకు ప్రభుత్వం, అధికారులు బాధ్యత వహించాలని హెచ్చరించారు. కార్మికుల సమ్మెకు సిఐటియు, మెడికల్ రిప్స్ యూనియన్ రమేష్, రామకృష్ణ, వి.ఎ.రాజు, అంగన్‌వాడీలు సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కొమర రాజేశ్వరి, కె.రాజమ్మ, ఎన్.సురేష్, టి.ప్రసాద్, ఎస్.శ్రీను, డి.ఆశీర్వాదం, ఎ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : మున్సిపల్ కార్మికుల చేపట్టిన సమ్మె తీవ్రతరం అవుతోంది. సమస్యలు పరిష్కరించకపోగా కార్మికులను రెచ్చగొట్టే విధంగా పోటీ కార్మికులను తీసుకురావడాన్ని సిఐటియు, ఎఐటియుసి తీవ్రంగా ఖండించాయి. శుక్రవారం సమ్మె కొనసాగింది. ఈ మేరకు పట్టణంలోని ఏడు డివిజన్లలో కార్మికులు, నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. సమ్మె ఎందుకు చేయాల్సి వచ్చిందో ప్రజలకు తెలిపారు. అనంతరం పనికి వచ్చిన పోటీ కార్మికులను వెళ్లిపోవాలని కోరారు. ఈ నేపథ్యంలో ఎక్కడికక్కడ పనిముట్లు వదిలివేసి పోటీ కార్మికులు వెళ్లిపోయారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు మాట్లాడుతూ అధికారులతో సమ్మె విచ్ఛిన్నం చేయాలని ప్రభుత్వం భావిస్తోందని, ఐక్యంగా కార్మికులు తిప్పికొడతారని తెలిపారు. మున్సిపాల్టీలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో జెఎసి నాయకులు జి.నాని నీలాపు రాజు, బంగారు వరలక్ష్మి, నీలాపు విశ్వనాథం, నిమ్మకాయల ధనలక్ష్మి, ధనాల చినపెద్దిరాజు, బంగారు ఏసేపు మాడుగుల లక్ష్మి పద్మ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం సమీపంలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె 11వ రోజు కొనసాగింది. ఈ మేరకు కార్మికులు పొర్లు దండాలు పెట్టి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కర్రి నాగేశ్వరరావు హాజరై మాట్లాడారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.సతీష్, టి.భాను, దయామణి, దుర్గ నాయకత్వం వహించారు.

ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికుల బైఠాయింపు

తమ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు ఎఐటియుసి అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయం వద్ద బైఠాయించారు. రెండు గంటలపాటు నిరసన చేపట్టారు. ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళింగ లక్ష్మణరావు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కంకట రత్నకుమార్ సమ్మెకు మద్దతు తెలిపారు. ఆర్‌డిఒ కె.చెన్నయ్య మాట్లాడుతూ కార్మికుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ముందుగా సమ్మె శిబిరం నుండి కార్మికులు పట్టణంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ నేపథ్యంలో తాలూకా ఆఫీస్ ఆవరణలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెకు మద్దతు తెలిపారు. ఎఐటియుసి ఏరియా కమిటీ కార్యదర్శి ఓసూరి వీర్రాజు మాట్లాడారు.

పాలకొల్లు : మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు మూడు రోజులుగా కొనసాగుతున్న దీక్షకు ఎంఎల్ఎ సంఘీభావం తెలిపి మాట్లాడారు. నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. దేశానికి సేవ చేసే డాక్టర్లు, సైంటిస్టులు, ఇంజనీర్లు సమాజానికి ఎంత అవసరమో అంతకన్నా ఎక్కువ సేవ చేసే పారిశుధ్య కార్మికులు అంతే అవసరం అన్నారు. మరోపక్క ఎన్నికలకు ముందు జగన్ మద్యపాన నిషేధం చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక మాట మార్చారన్నారు.

ఉండేదెవరు.. ఊడేదెవరు..!



సిట్టింగ్ ఎంఎల్ఎల్లో టిక్కెట్ టెన్షన్

రెండు జిల్లాల్లోనూ 12చోట్ల వైసిపి ఎంఎల్ఎలే

ఇప్పటికే పోలవరం, చింతలపూడి ఎంఎల్ఎలకు గుడ్‌బై

మరో నాలుగైదు స్థానాల్లో మార్పు తథ్యమంటూ ప్రచారం

మంత్రుల స్థానాల మార్పుపైనా ఊహాగానాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అధికార పార్టీ ఎంఎల్ఎల్లో టిక్కెట్ టెన్షన్ వెంటాడుతోంది. నిన్నటి వరకూ ధీమాగా ఉన్నవారు సైతం టిక్కెట్ ఉంటుందో.. ఊడుతుందో అనే ఆందోళనలో ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 80కుపైగా స్థానాల్లో మార్పు తథ్యమంటూ వైసిపి అధిష్టానం ఇప్పటికే సంకేతాలు పంపింది. కొన్ని స్థానాల్లో మార్పులు సైతం చేసింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలుండగా వీటిలో 12 చోట్ల వైసిపి ఎంఎల్ఎలు ఉన్నారు. ఉన్న సిట్టింగ్ స్థానాల్లో సగం చోట్ల మార్పు తథ్యమనే చర్చ నడుస్తోంది. ప్రజల్లో వ్యతిరేకత ఉన్నవారిని తప్పించి కొత్తవారిని బరిలోకి దింపేందుకు వైసిపి అధిష్టానం తీవ్ర కసరత్తు చేస్తోంది. ఏలూరు జిల్లాలో ఏడు స్థానాలకుగాను ఇప్పటికే చింతలపూడి, పోలవరం స్థానాల్లో మార్పులపై అధిష్టానం స్పష్టత ఇచ్చింది. చింతలపూడి సిట్టింగ్ ఎంఎల్ఎ ఎలిజాకు టిక్కెట్ లేదని స్పష్టత ఇవ్వగా, పోలవరంలో సిట్టింగ్ ఎంఎల్ఎ తెల్లం బాలరాజును తప్పించి ఆయన భార్యకు టిక్కెట్ ఇవ్వాలని నిర్ణయించారు. బాలరాజును తప్పించి ఆయన భార్యకు టిక్కెట్ ఇవ్వడంపైనా తీవ్ర చర్చ నడుస్తోంది. భార్యకు టిక్కెట్ ఇస్తే వ్యతిరేకత ఎలా పోతుందనే చర్చ జనాల్లో తీవ్రంగా కొనసాగుతోంది. ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు స్థానంలో కొత్తవారిని బరిలో దించాలని ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే సరైన అభ్యర్థి దొరక్కపోతే వాసుబాబునే కొనసాగించాలనే లెక్కలు సైతం అధిష్టానం వేస్తున్నట్లు చెబుతున్నారు. ఏలూరు నుంచి సిట్టింగ్ ఎంఎల్ఎ, మాజీ మంత్రి ఆళ్ల నానికే అవకాశం ఉంటుందని చెబుతున్నప్పటికీ, మార్పుపై ఆలోచన చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

ఇక పశ్చిమగోదావరి జిల్లాలో మూడు స్థానాల్లో మార్పులు తప్పవనే ప్రచారం సాగుతోంది. మార్పులు చేసే స్థానాల్లో ఆచంట, నరసాపురం, తాడేపల్లిగూడెం ఎంఎల్ఎల పేర్లు ఎక్కువగా విన్పిస్తున్నాయి. ఆచంట ఎంఎల్ఎ, మాజీ మంత్రి చెరుకువాడ రంగనాథరాజును ఆచంట నుంచి తప్పించి పాలకొల్లు టిక్కెట్ ఇవ్వాలని ఆలోచన చేసినట్లు తెలుస్తోంది. అయితే ఇస్తే ఆచంట ఇవ్వాలని, లేకపోతే లేదని రంగనాథరాజు ఖరాఖండీగా చెప్పినట్లు సమాచారం. దీంతో రంగనాథరాజును మారిస్తే అక్కడ ఎవరిని నిలబెట్టాలనే ఆలోచనలో అధిష్టానం ఉన్నట్లు చెబుతున్నారు. నరసాపురం ఎంఎల్ఎ ముదునూరి ప్రసాద్‌రాజు మార్చాలని ఆలోచనలు సైతం జరుగుతున్నట్లు సమాచారం. నరసాపురంలో నిలబెట్టేందుకు బలమైన అభ్యర్థి కోసం అధిష్టానం కుస్తీ పడుతున్నట్లు తెలుస్తోంది. మంత్రి కొట్టు సత్యనారాయణను మార్చి ఉంగుటూరులో నిలబెట్టాలనే ఆలోచన సైతం వైసిపి అధిష్టానం చేస్తున్నట్లు తెలుస్తోంది. రెండు జిల్లాల్లోనూ సగం స్థానాల్లో మార్పులు చేయాలనే ఆలోచనలో వైసిపి ఉన్నప్పటికీ బలమైన అభ్యర్థులు దొరక్క వెనక్కి ముందుక్కి ఊగిసలాడుతున్నట్లు తెలుస్తోంది. మార్పులు చేద్దామన్న పలు స్థానాల్లో కొత్త అభ్యర్థులు దొరకడం లేదనే చర్చ నడుస్తోంది. ఇప్పటికే ఎంపీ స్థానాలకు అభ్యర్థులు దొరక్క వైసిపి అధిష్టానం మల్లగుల్లాలు పడుతుందని, ఇప్పుడు ఎంఎల్ఎ స్థానాల్లోనూ అటువంటి పరిస్థితి ఉన్నట్లు చెబుతున్నారు. అధిష్టానం ఇస్తున్న లీకులు, సమాచారంతో సిట్టింగ్ ఎంఎల్ఎల్లో గుబులు నెలకొంది. టిక్కెట్ ఉంటుందా.. ఊడుతుందో తెలియడం లేదంటూ కార్యకర్తల వద్ద తమ అక్కసు వెళ్లగక్కుతున్నట్లు తెలుస్తోంది. దీంతో అధికార పార్టీ వైసిపి ఎంఎల్ఎల తుది జాబితాలో సిట్టింగ్ ఎంఎల్ఎలకు ఎవరికి అవకాశం ఉంటుందో.. ఎవరికి గుడ్‌బై చెబుతారో వేచిచూడాలి.

31న భీమవరంలో ఎంఎల్‌సిల సదస్సు

శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 31న భీమవరంలో ఎంఎల్‌సిల రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు తెలిపారు. శుక్రవారం భీమవరంలోని శాసనమండలి ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్‌తో కలిసి ఎంఎల్‌సిల సదస్సు నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా మోషేనురాజు మాట్లాడుతూ శాసనమండలి విధి, విధానాలు, క్వశ్చన్ అవర్, షార్ట్ డిస్కషన్స్, సభలో సభ్యులు వ్యవహరించాల్సిన తీరు, అనుసరించాల్సిన నిబంధనలు, సూచనలు తదితర అంశాలపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎంఎల్‌సిలతో చర్చించనున్నట్లు తెలిపారు. సదస్సు నిర్వహణకు భీమవరం బివి.రాజు కళాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఎన్నో ఏళ్ల కిందట ఇటువంటి సదస్సు నిర్వహించడం జరిగిందని, ఇప్పుడు భీమవరంలో నిర్వహించడానికి ఆలోచన చేశామని తెలిపారు. సదస్సు నిర్వహణ ప్రాంతంలో బందోబస్తు, పట్టణంలో పారిశుధ్యం నిర్వహణ, అతిథులకు ఆహ్వానం, స్థానికంగా చర్చి, మసీదు, దేవాలయాల దర్శనం, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. సమావేశంలో రాష్ట్ర అసెంబ్లీ సెక్రటరీ జనరల్ పిపికె.రామాచార్యులు, జాయింట్ సెక్రటరీ విజయరాజు, సహాయ కార్యదర్శులు శ్రీనివాసరావు, విశ్వనాథ్, డిఆర్‌ఒ బి.శివన్నారాయణ, ఆర్‌డిఒ కె.శ్రీనివాసులు రాజు, మున్సిపల్ కమిషనర్ కె.శ్యామల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాసనమండలి ఛైర్మన్ మోషన్ రాజు

హక్కుల పై అవగాహనుండాలి

జాయింట్ కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం


వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా అధికారులు, వినియోగదారుల ఉద్యమ సభ్యులు, విద్యార్థులతో జెసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు రోజురోజుకూ విస్తరిస్తున్నాయని, నాణ్యత విషయంలో లోపాలుంటే సామాన్య వ్యక్తి కూడా ప్రశ్నించే స్థాయిలో ఉన్నప్పుడే సమస్యలు తెలుస్తాయని, అప్పుడే పరిష్కారానికి మార్గం ఏర్పడుతుందన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నగదు, బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై జిల్లా మేనేజర్ టి.శివరామ ప్రసాద్, డిఎస్‌ఒ ఎన్.సరోజ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి.మహేశ్వరరావు, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ఎ.సుందర రామిరెడ్డి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.వెంకటరమణ పాల్గొన్నారు.

30, 31న తణుకులో..

కల్లు గీత కార్మిక సంఘ రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు ఈ నెల 30, 31వ తేదీల్లో తణుకులో నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ తెలిపింది. శుక్రవారం తణుకులోని స్థానిక అమరవీరుల భవనంలో జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మహాసభల ఆహ్వాన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర చేతివృత్తుల సంఘాల కన్వీనర్ ఎం.భాస్కరయ్య మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత చేతి వృత్తిదారులకు, వృత్తికి రక్షణ లేకుండా పోయిందన్నారు. వారి వృత్తిని ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. నేడు గీత వృత్తి ప్రమాదంలో పడిందన్నారు. గీత కార్మికులు పస్తులతో కాలం గడిపేస్తున్నారన్నారు. కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ మహాసభల్లో కర్తవ్యాలు రూపొందించి గీత వృత్తి రక్షణ కోసం పోరాటాలు చేయాలని, ప్రభుత్వం దిగొచ్చే వరకూ కార్మికులు పోరాడాలని పిలుపునిచ్చారు. ఆహ్వాన కమిటీ గౌరవాధ్యక్షులుగా ఇళ్ల వెంకటేశ్వరరావు (ఎంఎల్‌సి), అధ్యక్షులుగా కామన మునిస్వామి, గౌరవ సభ్యులుగా వాసంశెట్టి రాజగోపాల్ గూడూరి సత్యనారాయణ, జుత్తిగ చంద్రప్రసాద్, కొండేటి శ్రీనివాసు, కట్ట నాగ పోతురాజు, మరి కొంతమందిని ఏర్పాటు చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఎర్ర దేవుడు, కేతా గోపాల్, పివి.ప్రతాప్, బళ్ల చిన వీరభద్రం, కాగిత పాండు, బొక్క చంటి, మామిడిశెట్టి భూషణం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భాస్కరయ్య

చంద్రబాబు బహిరంగ సభకు చురుగ్గా ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఆచంట

ఈ నెల 7వ తేదీన ఆచంటలో నిర్వహించనున్న చంద్రబాబు నాయుడు పాల్గొనే బహిరంగ సభకు సంబంధించి టిడిపి శ్రేణులు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆచంట మార్టేరు ప్రధాన రహదారిని ఆనుకుని ఆచంటలో ఉన్న ప్రయివేట్ లే అవుట్‌లో సభ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. టిడిపి జిల్లా ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి, ఏలూరు జిల్లా ఇంచార్జ్ గన్ని వీరాంజనేయులు, ఉభయ గోదావరి జిల్లాల సమన్వయకర్త గోరంట్ల బుచ్చియ్యచౌదరి, టిడిపి మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు సాగుతున్నాయి. సభకు సుమారు లక్ష మంది హాజరయ్యేలా టిడిపి శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నాయి. సభను విజయవంతం చేయాలని కోరుతూ పితాని సత్యనారాయణ, టిడిపి, జనసేన శ్రేణులతో గ్రామాల్లో పర్యటించారు.

మొగల్తూరు : టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ఈ నెల ఏడో తేదీన ఆచంటలో చేపట్టిన రా కదలి రా భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాజానగరం నియోజకవర్గ పరిశీలకులు బొద్దు వెంకటరమణ చౌదరి పిలుపునిచ్చారు. మొగల్తూరులో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షులు గుబ్బల నాగరాజు అధ్యక్షత శుక్రవారం నిర్వహించిన మండల కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆ పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, ప్రసాదంశంది, టిడిపి నియోజకవర్గ నాయకులు కొవ్వలి యతిరాజు రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు.

ఉండి : ఆచంటలో ఈ నెల ఏడో తేదీన జరగనున్న రా కదలిరా కార్యక్రమానికి జనసేన శ్రేణులు భారీగా తరలి రావాలని ఆ పార్టీ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగరాజు పిలుపునిచ్చారు.

భూ హక్కు చట్టం రద్దు కోరుతూ నిరసన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ నరసాపురం న్యాయవాదులు చేపట్టిన నిరసన శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు చల్లా దానయ్యనాయుడు, పుప్పాల వెంకటస్వామి, జె.సెమన్ విజయ్‌కుమార్, వైరాని నాగేశ్వరరావు, నెక్కంటి క్రాంతికుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కొత్తపల్లి రమేష్, నక్కా ఆనందబాబు, కొప్పినీడి చిట్టి పద్మజ, దొంగ నరసింహారావు, గన్నాబత్తుల మత్స్య వల్లభరావు, కొల్లి మాణిక్యాలరావు, పొలిశెట్టి నారాయణస్వామి, నక్కా కుమార్ లక్ష్మి, విన్నా సూర్య ప్రకాష్, కరెళ్ల దుర్గా అనూష, చల్లా జ్యోతి, కోపల్లె నాగ శిరీష, ధనాల చాముండేశ్వరి పాల్గొన్నారు.

జగ్గారావు మృతి తీరని లోటు

ప్రజాశక్తి - గణపవరం


జగ్గారావు (ఫైల్)

సిపిఎం కేశవరం గ్రామ శాఖ సభ్యులు జగ్గారావు (75) శుక్రవారం ఉదయం ఆయన స్వగృహంలో మృతి చెందారు. జగ్గారావు మృతదేహాన్ని సిపిఎం మండల కార్యదర్శి పెన్మెట్ట నరసింహరాజు, నాయకులు నరాలశెట్టి రామకృష్ణ, శేఖా శ్రీను సందర్శించి సంతాపం తెలిపారు. జగ్గారావు 1986లో సిపిఎంలో చేరారు, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారని నరసింహరావు చెప్పారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు.

జూద క్రీడలు ఆడితే చర్యలు

ప్రజాశక్తి - పాలకోడేరు


మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసరావు

సంక్రాంతి పండగ ముసుగులో కోడిపందేలు, జూద క్రీడలు నిర్వహించినా, ఆడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పాలకోడేరు ఎస్ఐ నాలం శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని కుమారదవల్లి, మొగల్లు సిద్ధాపురం వద్ద సంప్రదాయ క్రీడల ముసుగులో జూద క్రీడలు జరగకుండా అవగాహన కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి భూపతిరాజు వంశీకృష్ణమరాజు, మల్లిపూడి కృష్ణకుమార్, తహశీల్దార్ షేక్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి రాజేష్, వీఆర్ఓ సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమాతో భద్రత : గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రతి కుటుంబానికి వైఎస్ఆర్ బీమాతో సిఎం జగన్ భద్రత కల్పించారని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 19వ వార్డుకు చెందిన చేబ్రోలు నాగేశ్వరరావు, 39వ వార్డుకు చెందిన మానేపల్లి తాతారావు ఇటీవల మరణించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన ఒక్కొక్కరికి రూ.ఐదు లక్షల నగదును ఆయన చేతుల మీదుగా శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ పథకంలో రూ.25 లక్షల వరకు విలువైన వైద్యాన్ని కార్పొరేట్ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు అందించేందుకు సిఎం జగన్ చర్యలు తీసుకున్నారన్నారు.

విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ పరీక్షలు

ప్రజాశక్తి - భీమవరం

డిఎన్ఆర్ కళాశాల ఉన్నత భారత్ అభియాన్ ఆధ్వర్యంలో దత్తత గ్రామమైన అనాకోడేరులో డిఎన్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం బ్లడ్ గ్రూప్ పరీక్షలు నిర్వహించారు. గ్రామ సర్వేలో గృహ అవసరాలకు సంబంధించిన సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ గూడపాటి మిల్టన్ అధ్యక్షత వహించిన సభలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆంధ్రా యూనివర్శిటీ ఉన్నత్ భారత్ అభియాన్ సమన్వయకర్త డాక్టర్ పావని మాట్లాడుతూ పాఠశాలకు కావాల్సిన మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచి జె.దుర్గావరప్రసాద్, ఎంపిటిసి సభ్యులు ఎం.వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచి పెచ్చెట్టి సత్యనారాయణ, డిఎన్ఆర్ కళాశాల ఉన్నత్ భారత్ అభియాన్ సమన్వయకర్త ఎస్.అనిల్‌దేవ్ పాల్గొన్నారు.

'బిసిలను తాకట్టు పెట్టిన కృష్ణయ్య'

పాలకొల్లు : బిసిలను వైసిపికి తాకట్టు పెట్టి రాజ్యసభ సభ్యత్వం తీసుకున్న ఆర్.కృష్ణయ్య ఎపిలో బిసి సంక్షేమం గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల రిజర్వేషన్లలో కోత పెట్టి 16 వేల మంది బిసిలు పదవులు కోల్పోవడానికి జగన్ కారణమన్నారు. ఎపిలో బిసిలకు అనేక సమస్యలు ఉన్నాయని, కృష్ణయ్యకు చిత్తశుద్ధి ఉంటే ఆ సమస్యలపై పోరాడాలన్నారు.

ఘనంగా నాగరాజు పుట్టినరోజు వేడుకలు

ఉండి : టిడిపి మండలాధ్యక్షుడు, యువనేత కరిమెరక నాగరాజు పుట్టినరోజు వేడుకలు పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్య అతిథిగా ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు హాజరయ్యారు.

'చంద్రబాబు వాగ్దానాలు నమ్మి మోసపోవద్దు'

వీరవాసరం : చంద్రబాబు అమలు కాని వాగ్దానాలతో మోసపోవద్దని భీమవరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండలంలో శుక్రవారం నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. వీరవాసరంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని, అనంతరం మండల పరిషత్ కార్యయలంలో కొత్త పెన్షన్లు అందించారు. అనంతరం కొణితివాడలో ఆరోగ్యశ్రీ కార్డులు, లబ్ధిదారులకు ఇంటి పట్టాలు అందించి ఫ్లాట్ పొజిషన్ చూపించారు. ఈ కార్యక్రమంలో భీమవరం ఎఎంసి ఛైర్మన్ కోటపల్లి బాబు, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, నాగరాజు శ్రీనివాసరాజు, మానుకొండ ప్రదీప్‌కుమార్, కడలి ధర్మారావు, ఎంపిడిఒ జ్యోతి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

బాలిక అదృశ్యంపై కేసు

ఉండి : బాలిక అదృశ్యంపై ఉండి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహదేవపట్నం గ్రామానికి చెందిన జక్కుల అనసూయ కోడలు గల్ఫ్‌లో ఉంటుంది. అనుసూయ తన మనవరాలిని ఏలూరు హాస్టల్‌లో ఉంచి బైబిల్ ట్రైనింగ్ ఇప్పిస్తుంది. బాలిక క్రిస్మస్ సెలవులకు స్వగ్రామం మహదేవపట్నం వచ్చి తిరిగి ఈ నెల 3వ తేదీన ఏలూరు బయలుదేరింది. కాని హాస్టల్‌కు వెళ్లకపోవడంతో అనసూయ తన బంధువుల ఇంటికి వెళ్లి ఆదా తీసింది. ఎక్కడా తన మనవరాలి ఆచూకీ లభ్యం కాకపోవడంతో శుక్రవారం ఉండి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

అదరం.. బెదరం

25వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె


తణుకు రూరల్‌లో...

తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారంతో 25వ రోజుకు చేరుకుంది. తాము ఎలాంటి బెదిరింపులకు అదరబోమని, బెదరబోమని స్పష్టం చేశారు.

ప్రజాశక్తి - తణుకు రూరల్

ప్రభుత్వ బెదిరింపులకు, తాటాకు చప్పుళ్లకు అంగన్‌వాడీలు భయపడరని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, మండల కార్యదర్శి గుబ్బల గోపీ హెచ్చరించారు. స్థానిక కోర్టు సెంటర్ వద్ద 25వ రోజు సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు వినూత్నంగా చీపుర్లు పట్టుకుని రోడ్లు ఊడ్చుతూ నిరసన తెలిపారు. అంగన్‌వాడీలపై బెదిరింపులు ఆపాలని, మాట ఇచ్చి తప్పిన జగన్ డౌన్‌డౌన్, సమ్మె కొనసాగిస్తామని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్, గోపీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గార రంగారావు, వసంతకుమారి, కనకదుర్గ, మణిమాలతి, ధనలక్ష్మి, రజని, నళినిరాణి, ప్రమీల, రాధ, వరహాలు, జయంతి, జ్యోతి, మహాలక్ష్మి, మాధవి, మధుషీల పాల్గొన్నారు.

గణపవరం : గణపవరంలో అంగన్‌వాడీలు ఒంటికాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించేవరకూ పోరాటం చేస్తామని అంగన్‌వాడీ మండల నాయకులు బి.రామకోటి అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ధనలక్ష్మి, కల్యాణి, బండారు మహాలక్ష్మి, కెవి.సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

ఆచంట (పెనుమంట్ర) : పెనుమంట్ర తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి కళ్యాణి మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో విజయవాడలో, జిల్లాస్థాయిలో కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే రిలే నిరాహార దీక్షలకు ప్రతి కార్యకర్త తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెనుమంట్ర, ఆలమూరు, మార్టేరు సెక్టార్ నాయకులు సాయిమహాలక్ష్మి, మౌనిక, సరస్వతి, కార్యకర్తలు శాంతికుమారి, సులోచన, లక్ష్మి, భాగ్యలక్ష్మి, శాంతి, శ్రీదేవి, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఆచంట : స్థానిక కచేరి సెంటర్‌లో అంగన్వాడీలు పలు రూపాల్లో తమ నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ జిల్లా ఉపాధ్యక్షులు వైట్ల ఉషారాణి, మైలే విజయలక్ష్మి, గుత్తుల శ్రీదేవి, మహేశ్వరి, జి.కమల, వెంకటలక్ష్మి, పి.పద్మ, సత్యవతి, గౌరీశ్వరి, నాగలక్ష్మి, సుజాత, వెంకటలక్ష్మి, ఝాన్సీ పాల్గొన్నారు.

పెంటపాడు : పెంటపాడులో సమ్మె శిబిరం వద్దకు సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ వచ్చి మద్దతు తెలిపి మాట్లాడారు. సిరపరపు రంగారావు, సిపిఎం మండల కార్యదర్శి పుల్లారెడ్డి, అంగన్వాడీ నాయకులు శ్యామలకుమారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.శ్రీదేవి, వి.కనకమహాలక్ష్మి, జి.జయలక్ష్మి, ఆర్.అనురాధ, టి.వెంకటలక్ష్మి, కె.వరలక్ష్మి, కె.గాయత్రిదేవి, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ దుర్గ పాల్గొన్నారు.

కాళ్ల : తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ఒంటి కాలిపై నిల్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ లీడర్ దావులూరు మార్తమ్మ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సిఐటియు మండల అధ్యక్షులు గొర్ల రామకృష్ణ, అంగన్‌వాడీ నాయకులు ఝాన్సీరాణి, ఎడవల్లి చంద్రావతి, రాజమణి, ఝాన్సీ పాల్గొన్నారు.


అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోవడం దారుణమని కాంగ్రెస్ పార్టీ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశ్న వెంకటగోపాలకృష్ణంరాజు అన్నారు. సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సోడదాసి గంగయ్య, అంకెం సీతారాం పాల్గొన్నారు.

ఆకివీడు : అంగన్‌వాడీలు ఒంటికాలిపై నిల్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీరాణి, సంయుక్త కార్యదర్శి షేక్‌హసీనా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండలాధ్యక్షులు వెంకీ అప్పారావు, అంగన్వాడీల నాయకురాలు జి.పైడేశ్వరి, దుర్గాదేవి, కనకదుర్గ, సీతామ హాలక్ష్మి, కృష్ణకుమారి పాల్గొన్నారు.


పెనుగొండలో...

తాడేపల్లిగూడెం : తహశీల్దార్ కార్యాలయం వద్ద ఒంటి కాలిపై నిల్చుని నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామోహన్‌రాయ్, జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరెడ్ల రామకృష్ణ, యడవల్లి వెంకటదుర్గారావు, ప్రభారాణి, కనకమహాలక్ష్మి, వరలక్ష్మి, ప్రసన్న, గాయత్రి, వీరమ్మ పాల్గొన్నారు.

యలమంచిలి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట కబడ్డీ ఆడుతూ తమ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు దేవ సుధాకర్, అంగన్‌వాడీ సంఘం నాయకులు రజినిదేవి, పద్మశ్రీ పాల్గొన్నారు.


కాళ్లలో...

భీమవరం : భీమవరంలో సమ్మె 25వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి.వాసుదేవరావు, జి.విజయలక్ష్మి, ఎస్.సింహాద్రి, జివివి.కనకదుర్గ, సీతారత్నం పాల్గొన్నారు.

పెనుగొండ : సమ్మె శిబిరం వద్ద అంగన్‌వాడీలు పచ్చగడ్డిని తింటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ లీడర్ కె.తులసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వెంకటేశ్వరరావు, గంగారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పాలకొల్లు : తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు 25 అంకెగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ నిరసనలో సిఐటియు మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, ఎం.శ్రీదేవి, బి.నాగలక్ష్మి, పి.పద్మావతి, జి.ఝాన్సీరాణి, బి.అభిరాణి, ఎం.భవాని పాల్గొన్నారు.

ఉండి : తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం 25వ రోజుకు సమ్మె కొనసాగింది. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి మహమ్మద్ హసీనా బేగం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు, హెల్పర్లు పాల్గొన్నారు.

మొగల్తూరు : అంగన్వాడీల సమ్మె 25వ రోజు శుక్రవారం కొనసాగింది. అంగన్వాడీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దింట్లు, సీత, సారమ్మ, నాగలక్ష్మి, రేఖ శాంభవి పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : స్థానిక అంబేద్కర్ కూడలిలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్దిరాజు, సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు దీక్ష శిబిరం వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము, ఎ.నీలిమ, కృష్ణవేణి, రాజేశ్వరి, రత్నకుమారి, శ్రీలక్ష్మి, రజిని, నిర్మలాకుమారి పాల్గొన్నారు.

నేటి నుంచి నిరాహార దీక్షలు ప్రారంభం

అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణి

భీమవరం : సమ్మెను మరింత ఉధృతం చేస్తున్నట్లు అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కల్యాణి అన్నారు. జిల్లా కేంద్రమైన భీమవరంలో నిరాహార దీక్షలు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణి మాట్లాడుతూ సమ్మె చేపట్టి రోజులు గడుస్తున్నా సిఎం స్పందించకపోవడం దారుణమన్నారు. సమస్యలను పరిష్కరించకుండా నిర్బంధంతో అంగన్‌వాడీల సమ్మెను విఫలం చేయాలని ప్రభుత్వం ప్రయత్నించడం సరికాదన్నారు. తక్షణం ప్రభుత్వం సమ్మెను విరమింపచేయాలని కోరారు. ఈ సమావేశంలో సాగి విజయలక్ష్మి, జి.కనకదుర్గ, కుంకట్ల సీతారత్నం, మేరిగ్రేస్, టి.లక్ష్మి, మంగతాయారు పాల్గొన్నారు.

పాఠశాలకు నోటు పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి - భీమవరం

స్థానిక రాష్ట్ర శాసనమండలి ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో పిఎస్‌ఎం బాలికోన్నత పాఠశాలకు రెండు వేల నోటు పుస్తకాలను రాష్ట్ర శాసన మండల ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు సమక్షంలో కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందించారు. ఇటీవల కొయ్యే మోషేన్‌రాజు పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని ప్రజలు, అభిమానులు, స్థానిక నాయకులు పెద్ద ఎత్తున నోటు పుస్తకాలను అందించారు. ఆయన కోరిన మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా వాటిని పిఎస్‌ఎం పాఠశాలకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి రవి.ప్రకాష్, రాష్ట్ర అసెంబ్లీ సెక్రటరీ జనరల్ పిపికె.రామాచార్యులు, డిఆర్ఓ బి.శివన్నారాయణ, ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

విజయవాడ తరలిన మధ్యాహ్న భోజన కార్మికులు

ఆచంట (పెనుమంట్ర) : మధ్యాహ్న భోజన పథకం కార్మికులు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం విజయవాడకు తరలి వెళ్లినట్లు సిఐటియు మండల కార్యదర్శి కోడి శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు షేక్ మిరాభి, పద్మ, లక్ష్మి, సువార్త పాల్గొన్నారు.


ప్రజాభిమానం పొందిన సాబ్జీ ధన్యులు

జయంతి సభలో వక్తలు

ప్రజాశక్తి - గణపవరం

ఉపాధ్యాయునిగానే కాకుండా ఎంఎల్‌సిగా ప్రజా సమస్యలపై నిరంతరం కృషి చేసి ప్రజాభిమానం పొందిన షేక్ సాబ్జీ ధన్యులని యుటిఎఫ్ మండల కార్యదర్శి జిడి.భవానిప్రసాద్ అన్నారు యుటిఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో పిప్పర హైస్కూలులో సాబ్జీ జయంతి సభను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సభకు యుటిఎఫ్ మండల కమిటీ అధ్యక్షులు జె.నాని అధ్యక్షత వహించారు. భవానీప్రసాద్ మాట్లాడుతూ సాబ్జీ మృతి చెందినా ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడిగా అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు. ఆయన సాధనకు ప్రతి యుటిఎఫ్ కార్యకర్త కృషి చేయాలన్నారు. యుటిఎఫ్ జిల్లా నాయకులు ఆంజనేయులు మాట్లాడారు. సాబ్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రిటైర్డ్ టీచర్ చిత్తజల్లు పద్మ ఆర్థిక సహకారంతో అందించిన యుటిఎఫ్ టెస్టు పేపర్లను విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, ఇ.సూర్యనారాయణ, ఎస్.శర్మ, బి. రమేష్, పద్మాలత, సీతామాలతి, శ్రీదేవి, అపర్ణ పాల్గొన్నారు.

మొగల్తూరు : ఎంఎల్‌సి షేక్ సాబ్జీ జయంతి వేడుకలను యుటిఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సాబ్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు సిహెచ్.శ్రీనివాస్, కొల్లాటి బ్రహ్మయ్య, ధర్మారావు, కె.నాగరాజుకుమార్, ఎవి.మురళీధర్ పాల్గొన్నారు.


గణపవరంలో...

పాలకొల్లు : స్థానిక అంజలి మానసిక వికలాంగుల పాఠశాలలో విద్యార్థులకు సాబ్జీ మిత్రులు అల్పాహారం, పాలు అందించారు. ఈ కార్యక్రమంలో సాబ్జీ మిత్రులు సరిపల్లి జయప్రభ, ఈడివ ప్రసాద్, మద్దిశెట్టి వెంకటేశ్వరరావు, దండు పద్మావతి, దేవ సుధాకర్, పి.క్రాంతికుమార్, శ్రీనివాసరావు, పంతం రామ్మూర్తినాయుడు, వి.జగ్గారావు, చింత సత్యనారాయణ, వర్ధనపు సందీప్‌కుమార్, గుమ్మాపు ప్రభాకరరావు, పడవల బాలరాజు, దొమ్మేటి చంద్రశేఖరరావు, మండెల శివన్నారాయణ, బూరగడ్డ శైలజ పాల్గొన్నారు.

'ఆదిత్య' విద్యార్థులకు అంతరిక్షంపై అవగాహన

తాడేపల్లిగూడెం : మన శాస్త్రవేత్తలు చేసిన నిరంతర ప్రయోగాల కృషి ఫలితంగానే చంద్రుడి దక్షిణ ధ్రువంపై (చంద్రాయన్-3) అడుగుపెట్టిన తొలి దేశంగా భారత్ అవతరించిందని ఇస్రోకు చెందిన రిటైర్డ్ సైంటిస్ట్ యాళ్ల శివప్రసాద్ తెలిపారు. ఆ చారిత్రాత్మక ఘట్టాన్ని గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 23న నేషనల్ స్పేస్ డే గా ప్రకటించిందని, ఇలాంటి ఘనతలు యువతను సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్ వైపు ఆకర్షించి వారిలో ఉన్న సృజనాత్మకతను పెంపొందిస్తాయన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అంతరిక్షంపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కళాశాల డైరెక్టర్ కె.శ్రీనివాసారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అవసరమని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ పి.లక్ష్మీసరోజ మాట్లాడుతూ సైన్స్ పట్ల, అంతరిక్ష పరిశోధనల పట్ల విద్యార్థులు ఆసక్తిని పెంపొందించుకోవాలని సూచించారు.

రైతు భరోసా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని జగన్నాథపురంలో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ రైతుల మేలు కోసమే ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు తిరుమని బాపూజీ, గ్రామ సర్పంచి హర్షిత, జ్యోతి, ప్రసాదరాజు, ఎంపిటిసి సభ్యులు మంతెన సూర్యనారాయణ రాజు, ప్రజాప్రతినిధులు నడింపల్లి సుబ్బరాజు, తోటకూర కృష్ణంరాజు, శివాజీ రాజు, అనిల్‌కుమారి, ఎఇ అబ్దుల్ రహీం, ఎంపిడిఒ ఉండ్రు బాబ్జిరాజు, పంచాయతీరాజ్ ఎఇ అశోక్ పాల్గొన్నారు.

8న ఆటోల సమ్మె

ప్రజాశక్తి - ఆకివీడు

మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణ చట్టం తీసుకొచ్చి ఆటో కార్మికుల పొట్టలు కొట్టవద్దని ఆటో కార్మిక యూనియన్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసింది. స్థానిక సిఐటియు కార్యాలయంలో ట్రేడ్ యూనియన్ మండల కార్యదర్శి తవిటినాయుడు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వం నిర్ణయాన్ని నిరసిస్తూ 8వ తేదీన ఒకరోజు సమ్మె చేయాలని ఆటో యూనియన్ నిర్ణయించింది. ఈ సమ్మె 8వ తేదీ ఉదయం ఆరు గంటల నుంచి తొమ్మిదో తేదీ ఉదయం ఆరు గంటల వరకు అమలు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఆకివీడు నుంచి భీమవరం వెళ్లే బస్టాండ్ ఆటో యూనియన్ సాల్మన్‌రాజు, నాగబాబు, ఐ.భీమవరం రోడ్డు స్టాండ్ నుంచి నాగరాజు, సేనపతి శ్రీనివాస్, సిద్దాపురం వైపు స్టాండ్ సిహెచ్.ప్రసాద్, వై.రవిబాబు, పాము నాని, రవిబాబు పాల్గొన్నారు.

భారతీయ విద్యాభవన్స్‌లో సంక్రాంతి సంబరాలు

తాడేపల్లిగూడెం : పెదతాడేపల్లిలోని భారతీయ విద్యా భవన్స్‌లో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు, వ్యవసాయ పనిముట్లు, రైతుల వేషధారణ, గాలిపటాలు, భోగిపళ్లు, హరిదాసు వేషధారణ, పిట్టలదొర, గోరింటాకు, సోది సుబ్బక్క, బుర్రకథ, తోలుబొమ్మలాట, బుడబుక్కల, కోయిదొర, సన్నాయిడోలు బృందం, కథాకళి, ఆంధ్ర పిండివంట అలరించాయి. భారతీయ సంస్కృతికి సంప్రదాయ కళలను అనుసంధానం చేస్తూ విద్యార్థులు చేసిన పలు ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యాభవన్ ఛైర్మన్ చెరుకువాడ రంగనాథరాజు మాట్లాడుతూ ప్రాచీన ఆధునిక, ఆహార నియమాలు శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానం అలవర్చుకుని విద్యార్థి స్థాయి నుంచే ఉన్నతమైన స్థితికి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ కృష్ణంరాజు, ట్రెజరర్ గ్రంధి వరప్రసాద్, కమిటీ సభ్యులు మూర్తి, నాగేశ్వరరావు, శివరామరాజు, ప్రిన్సిపల్ రాజీవ్‌కుమార్‌శర్మ పాల్గొన్నారు.

7 నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు

భీమవరం : జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఈ నెల ఏడో తేదీ శ్రీ విష్ణు ఎడ్యుకేషన్ సొసైటీలో విష్ణు హైస్కూల్లో నిర్వహిస్తున్నట్లు జెవివి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చింతపల్లి ప్రసాదరావు, జామాను రామ లక్ష్మణరావు తెలిపారు. ప్రతి మండలం, పట్టణ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని చెకుముకి జిల్లా కన్వీనర్ రేపాక వెంకన్న బాబు తెలిపారు. సైన్స్ మ్యాజిక్ ప్రయోగాలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శ్రీనివాస్ తెలిపారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

పెనుగొండ : మండలంలోని దేవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎంపిపి పుతినీడి వెంకటేశ్వరరావు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నల్లూరి సత్యనారాయణ, వైస్ ఎంపిపి పాలపర్తి సుబ్రహ్మణ్యం, సాక సుబ్రహ్మణ్యం, దంపనబోయిన బాబూరావు, విద్యాకమిటీ ఛైర్మన్ నేలపూడి చినబాబు, ప్రధానోపాధ్యాయులు అత్యం నగేష్, ఉపాధ్యాయులు ఈతకోట సూర్యారావు, నేతల శ్రీను, నేలపూడి అంజి, పిల్లి భాస్కరరావు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

7న ఛాంబర్ కళాశాలలో మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష

పాలకొల్లు : పాలకొల్లు ఛాంబర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ పర్యవేక్షణలో కెవిఎం ఛాంబర్స్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల ఏడో తేదీ పాలకొల్లు ఛాంబర్స్ కళాశాల ప్రాంగణంలో పదో తరగతి విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఓల్గా చెప్పారు. ఈ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.20 వేలు, రెండో బహుమతిగా రూ.15 వేలు, మూడో బహుమతిగా రూ.పది వేలు, 11 కన్సొలేషన్ బహుమతులుగా ఒక్కొక్కరికీ రూ.ఐదు వేల చొప్పున ఫీజు రాయితీ రూపంలో ఇవ్వనున్నట్లు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే నాన్ లోకల్ విద్యార్థులకు ఉచిత బస్ సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. వివరాలకు 9398575721, 9030223014 సంప్రదించాలని కోరారు.

దస్తావేజులు పోయినవి

ఇందు మూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా క్లయింటు మాగంటి రామమోహనరావు గారి కుమారుడు కృష్ణమోహన్ కొత్తపల్లి గ్రామము నుండి ది.01-01-2024వ తేదీన గోపన్నపాలెంనకు వెళ్ళుచుండగా మార్గ మధ్యంలో 1) దస్తావేజు నెం. 1461/2007, దీని లింకు దస్తావేజు నెం. 1/1995, 2) దస్తావేజు నెం. 888/1993, దీని లింకు దస్తావేజు నెం.889/1993, 3) దస్తావేజు నెం. 887/1993, దీని లింకు దస్తావేజు నెం. 2/1995, 4) దస్తావేజు నెం. 935/1997 & 5) దస్తావేజు నెం.4504/1992 దస్తావేజులు పోగొట్టుకొనియున్నారు. కావున దయవుంచి ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది నెంబరుకి ఫోన్ గాని, లేక డైరెక్టుగా గాని తెచ్చి ఇవ్వగలరని కోరుచున్నాను.

ఇట్లు : కె.ఆర్.కె. చౌదరి
అడ్వకేట్, ఏలూరు, సెల్ : 9848605066

వేలము ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్‌జడ్జి వారికోర్టు-నూజివీడు
ఇ.పి. 37/2018 ఇన్ ఓ.యస్.నెం. 494/2015

బిట్వీన్ : వాసా శ్యామలాంబ అనే శ్యామల - డి.హెచ్.ఆర్.
మరియు
నీలపాల సత్యవతి - జె.డి.ఆర్.

కృష్ణా జిల్లా, నూజివీడు సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, ముసునూరు మండలం, గోపవరం గ్రామ ఆర్.యస్.నెం.305/6 రు దాఖలా య.0-07.1/2సెంట్లు లేక 363 చ.గజముల నివేశన స్థలం మరియు సదరు స్థలంలో నిర్మింపబడియున్న డోరు నెం. 1-25 దాఖలా ఆర్.సి.సి. డాబా ఇల్లు, సదరు ఇంటికి అమర్చబడియున్న యావత్ పరికరములతో సహా పై తెలిపిన జె.డి.ఆర్. యొక్క సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములలో వుండి ఈ డిక్రీ బాకీ క్రింద జప్తు ఛార్జి కాబడి, వేలం కావలసియున్న ఆస్తికి హద్దులు ::

తూర్పు - 5 గజముల నడకదారి,
దక్షిణం - నల్లిబోయిన నాగేశ్వరమ్మ గారి స్థలం
పడమర - సాయిల చిట్టియ్య గారి స్థలం
ఉత్తరం - 4 గజముల నడకదారి

డి.హెచ్.ఆర్.విలువ - రూ. 10,00,000/-
అమీనా విలువ - రూ.15,00,000/-

పైన తెలిపిన ఆస్థిని శ్రీకోర్టు వారు ది.29-01-2024 తేదీన ఉదయం 10-30 ని॥లకు బహిరంగ వేలం వేయుదురు. కావున కావాల్సిన వారు పాడుకొనవచ్చును.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
ఇట్లు
యమ్. రమేష్, డి.హెచ్.ఆర్. తరపు న్యాయవాదులు

మహారాజశ్రీ గౌరవనీయులైన అదనపు జూనియర్ సివిల్‌జడ్జి గారి కోర్టు, సత్తుపల్లి - ఖమ్మం జిల్లా - తెలంగాణ రాష్ట్రం

ఓ.యస్.నెం. 27/2023

బిట్వీన్ :
యిమ్మడి సత్యనారాయణ వరప్రసాద్ - వాది
మరియు
శ్రీసాయి శరవణభవ బేవరేజస్ (రిఫ్రెష్ మినరల్ వాటర్) ఆర్.యస్.నెం. 485/1సి/486 తరపున ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ గన్నే శ్రీనివాసరావు మరియు 4గురు - ప్రతివాదులు

నోటీసు

పై కేసులో 1వ ప్రతివాది అయిన ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్, శ్రీ సాయి శరవణభవ బేవరేజస్ (రిఫ్రెష్ మినరల్ వాటర్) నివాసం. నాగులగూడెం గ్రామం & పోస్టు, జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

2వ ప్రతివాది అయిన శ్రీ గన్నే శ్రీనివాసరావు, s/o.రామ మోహనరావు, నివాసం. నాగులగూడెం గ్రామం & పోస్టు, జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ వారి హాజరు నిమిత్తం ది.13-02-2024వ తేదీన వాయిదా కలదు. ఆ రోజు ఉదయం గం.10-30 ని॥లకు మీరు స్వయముగా గాని, లేక న్యాయవాది ద్వారా గాని గౌరవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, సత్తుపల్లి కోర్టు వారి ఎదుట హాజరు కాగలరు. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి అనుమతితో ఈ ప్రకటన యివ్వడమైనది //

ఇట్లు
సత్తుపల్లి,
తేది : 05-01-2024
కె.యస్.వి. ప్రసాదరెడ్డి
కె.కేశవరెడ్డి, అడ్వకేట్స్ - సత్తుపల్లి
సెల్ : 9346369030, 9989008802

పాస్‌పోర్టు పోయినది

నేను, బండి వీర వెంకట రామాంజనేయులు, తండ్రి : వెంకటేశ్వరరావు, కత్తవపాడు గ్రామం, ఇరగవరం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆం.ప్ర, అను నా పేరున ఉన్న పాస్ పోర్ట్ నం. S1583239రు గలది ఒరిజినల్ జిరాక్స్ తీయించుటకు, షాపుకు వెళుతుండగా పోయినది. దొరికిన వారు పై అడ్రస్ లోని సెల్. 9133729964కు తెలియజేయగలరు.

బండి వీర వెంకట రామాంజనేయులు,
తండ్రి : వెంకటేశ్వరరావు,
కత్తవపాడు గ్రామం, ఇరగవరం మండలం,
పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P.21/2021 in O.S.258/2013

Between:
శ్రీ అమామ్ కోటేశ్వరరావు ...DHR/వాది
S/o.వెంకటేశ్వరరావు, వయస్సు 71 సం॥లు, రిటైర్డ్ ఎంప్లాయి, సా॥జంగారెడ్డిగూడెం.
...JRG JCJC.

1.శ్రీ ఉన్నమట్ల ఏసురత్నం (Died)
2.శ్రీమతి ఉన్నమట్ల సౌభాగ్యం(Died)
3.శ్రీ ఉన్నమట్ల రాహుల్
4.కుమారి ఉన్నమట్ల ప్రియా అశ్విని
...JDR's/ప్రతివాద్లు

To.
JDR 4 : కుమారి ఉన్నమట్ల ప్రియా అశ్విని
D/o.లేటు ఏసురత్నం, వయస్సు 22 సం॥లు, స్టూడెంట్, C/o.పురెళ్ళ నాగేశ్వరరావు, డ్రైవర్ APSRTC Depot, వినాయక గుడి దగ్గర, సా॥జల్లేరు, జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా. ...JRG JCJC.

పై E.P నెంబరు గ్రంథములో JDR's తాలూకు షెడ్యూలు ఆస్తిని (ఇల్లు) వేలం వేయించి, డిక్రీ బాకీ యిప్పించమని కోరుచూ DHR యీ EP ని దాఖలు చేసియున్నారు. యిందులో 4 JDR కు కోర్టు వారి ద్వారా మరియు రిజిష్టర్డు పోస్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపించినను సదరు 4వ JDR నోటీసులు తీసుకొనకుండ Avoid చేయుచున్నారు. అందుచే ది.06-12-23వ తేదీన కోర్టు వారి ఆదేశానుసారముగా 4వ JDR అయిన మీరు, స్వయంగా గాని ప్లీడరు గారి ద్వారా గాని, ది.11-01-2024వ సం॥రం తేదీన ఉదయం గం.10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట హాజరయి మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలయును. లేనిఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని మీకు యిందు మూలముగా తెలయజేయడమైనది.

ఎస్.వి.వి.సూర్యనారాయణ
కొవ్వూరు అడ్వకేట్, నిడదవోలు.
తేది.4-1-24 సెల్: 9440933563